చిప్స్

ఎక్సెల్ వర్క్‌షీట్లని షేర్‌చేసుకోవడం...

మీరు నెట్‌వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్‌లో పనిచేస్తున్నపుడు మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ ద్వారా మీరు రూపొందించుకున్న వర్క్‌షీట్లను పలుపురు యూజర్లకు షేర్ చెయ్యదలుచుకున్నట్లయితే ఎక్సెల్‌లోని టూల్స్ మెనూలో ఉండే షేర్ వర్క్‌బుక్ అనే ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోండి. వెంటనే ఎడిటింగ్ టాబ్‌ను క్లిక్ చేసి Allow changes by more than one user at the same time అనే ఆప్షన్‌ను టిక్ చేసి ఓకె బటన్‌క్లిక్ చేయండి సేవ్ చెయ్యమని అడిగినపుడు వర్క్‌బుల్‌కు సేవ్ చేయండి. సేవ్ చేసేటపుడు ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీరు ఏయే యూజర్లకైతే ఆ వర్క్‌బుక్‌ని షేర్ చెయ్యాలనుకుంటున్నారో ఆ యూజర్లకు అందుబాటులో ఉండే నెట్‌వర్క్ లోకేషన్లలో మాత్రమే వర్క్‌బుక్‌ని షేర్‌చేయాలి. షేర్డ్ నెట్‌వర్క్ ఫోల్డర్‌ను ఉపయోగించుకోండి. వర్డ్ డాక్యుమెంట్లను మాదిరిగానే ఎక్సెల్ ఫైళ్లకి కూడా కామెంట్లను జతచేసుకోవచ్చు. ఒక సెల్‌లో కామెంట్ ఎంటర్ చేయదలచుకుంటే ఆ సెల్‌పై రైట్‌క్లిక్ చేసి Insert comment అనే ఆప్షన్‌ణు సెలెక్ట్ చేసుకోవాలి. మెసేజ్ కన్పించకూడదనుకుంట దాన్ని డిలీట్ చేసుకోవచ్చు. కూడా .

×××

సినిమా ఆడియోని ఎంపి3గా మార్చటం

మీవద్ద ఏదైనా వీడియో ఆల్బమ్ సిడి ఉందనుకుందాం. లేదా సినిమా విసిడిల్లోని పాటలను ఎంపి3 ఫార్మేట్‌లోకి కన్వర్ట్ చేసుకోవాలనుకుంటే. దానికో మార్గముంది. ముందుగా విసిడి కట్టర్ అనే ప్రోగ్రామ్‌ని ఉపయోగించి, ఆ వీడియో ఫైల్‌ని ఓపెన్ చేయండి. ఇప్పుడు ప్రారంభానికి ప్రోగ్రెస్‌బార్‌ను తీసుకువెళ్లి క్లిప్ మార్క్ ఇన్ బటన్‌ను క్లిక్ చేయండి. మళ్లీ ప్రోగ్రాస్ బార్‌ను పాట చివరకు తీసుకెళ్లి క్లిప్ మార్క్ అవుట్ అనే బటన్‌ను క్లిక్ చేయండి. దీనితో వీడియో, ఆడియోలతో కూడిన సాంగ్ పోర్షన్ మీరు కోరుకున్న లొకేషన్‌లో సేవ్ చెయ్యబడుతుంది. ఇప్పుడు ఆ క్లిప్‌ను మళ్లీ విసిడి కట్టర్‌తోనే ఓపెన్ చేసి, టూల్స్ మెనూలో ఉండే స్ప్లిట్ సిస్టమ్ ట్రీమ్ టు ఎంఐవి, ఎంపి3 అనే ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోండి. అలా వీడదీయబడే వీడియో, ఆడియో ఫైళ్లు ఎక్కడ స్టోర్ చేయ్యబడాలో లొకేషన్‌ని స్పెసిఫై చేస్తే సరిపోతుంది. తర్వాత, ఎంపి3 ఫైల్ మాత్రమే ఉంచుకుని వీడియో ఫైల్ తొలగించండి.

×××

టివి ట్యూనర్, మోనిటర్‌ఫ్రీక్వెన్సీ సరిపోవాలి

మార్కెట్లో లభ్యమవుతున్న అధికశాతం టివి ట్యూనర్‌కార్డులు సిస్టమ్‌లో pci slotపై అమర్చబడే విధంగా లభిస్తున్నాయి. కొన్ని కార్డులు AGP స్లాట్‌పై అమర్చుకునే విధంగా కూడా లభిస్తున్నాయి. AGP కార్డ్‌లు అటు టివిట్యూనర్ రికార్డుగానే కాకుండా డిస్‌ప్లే ఎడాప్టర్‌గా కూడా పనిచేస్తుంటాయి. అంటే ప్రత్యేకంగా **AGP** కార్డ్ కొనసాల్సిన పనిలేదు.సో మీ మదర్ బోర్డుపై **AGP** స్లాట్ ఉండి టివి ట్యూనర్‌కార్డ్‌ని కూడా అమర్చుకోదల్చుకున్న పక్షంలో AGP slot పై అమర్చగలిగే ట్యూనర్ కార్డ్‌ని ఎంచుకోవటం మంచిది. ప్రస్తుతం ఎక్స్‌టర్నల్ టివి ట్యూనర్‌కార్డ్‌లూ అందుబాటులోకి వచ్చాయి. వీటిని క్యాబినెట్ వెనుక భాగంలో **USB** పోర్ట్‌కు కనెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎక్స్‌టర్నల్ ట్యూనర్‌కార్డ్‌లు ఇంటర్నల్ ట్యూనర్‌కార్డ్‌లతో పోలిస్తే కొన్ని సదుపాయాలను తక్కువగా కలిగి ఉంటాయి. టివి ట్యూనర్‌కార్డున్ ఎంచుకునేటపుడు మీ వద్ద ఉన్న మోనిటర్ ఫ్రీక్వెన్సీరేట్‌కు సమానంగా కానీ, అంతకన్నా ఎక్కువ ఫ్రీక్వెన్సీరేట్‌ను కలిగి ఉన్న కార్డ్‌ని కానీ కొనటం మంచిది. సాధారణంగా అధునాతన మోనిటర్లు 75-85HZ ఫ్రీక్వెన్సీని సపోర్ట్ చేసేలా లభిస్తున్నాయి.

○

భద్రతలేని వర్డ్ డాక్యుమెంట్లు

ఆఫీస్ అవసరాలకు వాడే సాఫ్ట్‌వేర్‌ను ఆఫీస్ సూట్ అంటారు. ఒక సాధారణ ఆఫీస్ సూట్లో వ్యాసాలు రాయవచ్చు, ప్రజెంటేషన్లు ఇవ్వవచ్చు, కంపెనీ ఖాతాలు దాచటం వంటి పనులతోపాటు మరెన్నో పనులు కూడా చెయ్యవచ్చు. అన్ని ఆఫీస్ సూట్లలోనూ ఎక్కువగా వాడే ఆఫీస్ సూట్ "మైక్రోసాఫ్ట్ ఆఫీస్". మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌లో వ్యాసాలు రాయటానికి వాడే సాఫ్ట్‌వేర్‌ను మైక్రోసాఫ్ట్ వర్డ్ అంటారు. మైక్రోసాఫ్ట్ వర్డ్ వాడి మీరు ఒక వ్యాసాన్ని రాసి ఫైలులో భద్రపరిస్తే ఆ ఫైల్‌ను వర్డ్ డాక్యుమెంట్ అంటారు. వీటిపేరులో సాధారణంగా చివరలో **.doc** వుంటుంది. ఈ వ్యాసంలో వర్డ్ డాక్యుమెంట్ల వల్ల మీకు వచ్చే నష్టాలు వాటిని ఎదుర్కోవడానికి కొన్ని మార్గాలు చర్చించబడ్డాయి. మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌తో తయారు చేసిన ఇతర ఫైళ్ళు ప్రెజెంటేషన్లు **(.ppt),** స్ప్రెడ్ షీట్లు **(.xls)** కూడా ఇదే విధంగా చూడవచ్చు.

వర్డ్ డాక్యుమెంట్ల వల్ల వచ్చే నష్టాలు

వర్డ్ డాక్యుమెంట్లు మీకు హానికరమవ్వటానికి ముఖ్యమైన కారణం అవి రహస్యమైన పద్ధతిలో భద్రపరిచి వుండటం, మీరు మైక్రోసాఫ్ట్ వర్డ్ వాడి దాచిన వ్యాసం ఏ పద్ధతిలో దాచి వుందో మైక్రోసాఫ్ట్ వారికి తప్ప ఎవరికి తెలియదు. మైక్రోసాఫ్ట్ వారు ఈ పద్ధతిని వివరించటానికి నిరాకరించారు. దీనివల్ల మైక్రోసాఫ్ట్ వారు తయారు చేసిన సాఫ్ట్‌వేర్ తప్ప మరే సాఫ్ట్‌వేర్ ఈ వ్యాసాన్ని చదవలేవు. కనుక మీ సమాచారం యొక్క భవిష్యత్తు అమెరికాలో ఒక కంపెనీ అయిన మైక్రోసాఫ్ట్ వారిపై ఆధారపడివున్నట్టే.

మైక్రోసాఫ్ట్ వారు వర్డ్ డాక్యుమెంట్లను దాచే విధానాన్ని తరచూ అవసరం లేకపోయినా మారుస్తుంటారు. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ ఇప్పటికి చాలా వెర్షన్లలో విడుదల అయ్యింది. (4.0, 95, 98, 2000, **XP** మరియు ఇప్పుడు 2003) వీటన్నింటిలోనూ వర్డ్ డాక్యుమెంట్లను దాచే విధానం మారిపోయింది. దీనివల్ల ఒక వెర్షన్లో రాసిన వ్యాసం వేరే వెర్షన్లో చూడటం కుదరకపోవచ్చు. ఉదాహరణకు 2003 సంవత్సరంలో కొన్న మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌తో రాసిన వ్యాసం మీ స్నేహితుడు మీకు పంపితే మీరు మీ వద్ద నున్న 2000 సంవత్సరం నాటి మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌తో దాన్ని చూడలేరు. ఈ విధంగా మైక్రోసాఫ్ట్ వారు కొత్త వెర్షన్‌ను విడుదల చేసినప్పుడల్లా చాలా డబ్బులు వెచ్చించి ఆ కొత్త వెర్షన్ కొనేలా మీపై ఒత్తిడి వుంటుంది. ఇది మైక్రోసాఫ్ట్ వారు వారి వ్యాపారానికి నిలకడగా ఆదాయం వస్తుండటం కోసం వేసిన పథకం. అంతేకాకుండా కొన్నిసార్లు కొత్త వెర్షన్లలో పాత వ్యాసాలు చూడలేకపోవడం కూడా జరుగుతుంది. ఇది తరచుగా వ్యాసాలు రాసే పద్ధతిని మార్చడం వల్ల వచ్చిన సమస్య.

వర్డ్ డాక్యుమెంట్లలో వైరస్‌లు వుండే ప్రమాదం వుంది. మీకు ఎవరైనా వైరస్‌తో కూడుకున్న వర్డ్ డాక్యుమెంట్లు పంపినప్పుడు, మీరు దానిని చూడటానికి ప్రయత్నిస్తే చాలు ఆ వైరస్ మీ కంప్యూటర్‌కి సోకుతుంది. నిజానికి చాలా వైరస్‌లు ఈ విధంగానే వ్యాప్తి చెందుతాయి. ఒకసారి వైరస్ కంప్యూటర్ని సోకిన తరువాత వైరస్‌ను బట్టి అది ఏమైనా చేయవచ్చు. కొన్ని వైరస్‌లు మీ కంప్యూటర్‌ను వైరస్‌తో కూడిన ఈ ఫైళ్ళను పంపటంతో ఊరుకుంటాయి. కొన్ని మీ కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్నంతా తుడిచివేసి, మీ కంప్యూటర్ని వాడలేని విధంగా చేస్తాయి.

అంతేకాదు మీకు తెలియకుండా వర్డ్ డాక్యుమెంట్లలో మీరు ఇతరులకు ఇవ్వకూడదనుకునే చాలా సమాచారం వుండే అవకాశం వుంది. మీరు వ్యాసాన్ని ఎలా మార్పులు చేశారు, దాని చరిత్ర, ఎవరెవరు ఎప్పుడెపుడు దానికి ఏఏ మార్పులు చేసారు, ఈ సమాచారమంతా వర్డ్ డాక్యుమెంట్లలో మీకు కనిపించకుండా వుండవచ్చు. ఈ విషయం తెలియని వారు వ్యక్తిగత సమాచారం దగ్గరనుండి దేశభద్రతకు సంబంధించిన సమాచారం వరకు పోగొట్టుకుంటారు. **(http://news.bbc.co.uk/2/hi/technology/3154479.stm).**

మీరు వ్యాసాన్ని కనుక వర్డ్ డాక్యుమెంట్‌లా మీ స్నేహితునికి పంపితే, అతను పదివేల రూపాయలకు పైగా వెచ్చించి మైక్రోసాఫ్ట్ విండోస్, ఆపై మైక్రోసాఫ్ట్ ఆఫీస్ కొనవలసిన అవసరం వస్తుంది. లేదా అతను చట్ట విరుద్ధంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను కాపీ చేసి తెచ్చుకోవలసిన అవసరం వుంటుంది. వర్డ్ డాక్యుమెంట్లు రహస్యమైన పద్ధతిలో వుండటం వల్ల ఇతర ఆఫీస్ సూట్లు వీటిని చదవలేవు. అందువల్ల మీరు వర్డ్ డాక్యుమెంట్లు మీ ఇతరులకు పంపించినప్పుడు, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ వాడాలన్న వత్తిడి మీరు వారిపై కలుగచేస్తారు. చాలామంది మైక్రోసాఫ్ట్ వారి సాఫ్ట్‌వేర్‌పై ఆధారపడకుండా ఫ్రీ సాఫ్ట్‌వేర్లను వాడుతుంటారు. ఇక్కడ ఫ్రీ అంటే "ఉచిత" అని కాకుండా "స్వేచ్ఛ" అని అర్థం వస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌లా కాకుండా మన అవసరాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు, స్నేహితులకు చట్టబద్ధంగా కాపీలు కూడా పంపవచ్చు. అంతేకాదు, ఉచితంగా లభించి, మైక్రోసాఫ్ట్ ఆఫీసుకు ధీటుగా సదుపాయాలను అందచేసే ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఆఫీస్ సూట్లు వున్నాయి. వీటిలో ఓపెన్ ఆఫీస్.ఆర్గ్ **(Openoffice.org)** అనే ఆఫీస్ సూట్ ముఖ్యమైనది.

ఓపెన్ ఆఫీస్.ఆర్గ్ తయారు చేసిన వారు చాలా శ్రమపడి మైక్రోసాఫ్ట్ వర్డ్ రహస్యాన్ని కనిపెట్టారు. ఈ విధంగా వర్డ్ డాక్యుమెంట్లు చాలావరకు చదవగలిగినా, అంతా సరిగ్గా చేయటం అసాధ్యం. పైగా వర్డ్ డాక్యుమెంట్లు భద్రపరిచే పద్ధతి ప్రతీ వెర్షన్‌తో మారిపోతుంది. పైగా మైక్రోసాఫ్ట్ వారు ఇకపై వచ్చే వెర్షన్లలో కొత్త పద్ధతితో వర్డ్ డాక్యుమెంట్లు వేరే వారు చదవలేకుండా చేస్తున్నారు. అమెరికాలో మరియు ఇతర దేశాలలో వున్న సాఫ్ట్‌వేర్ పేటెంట్ చట్టాలను వాడి, వేరేవారు వర్డ్ డాక్యుమెంట్లు చదవటాన్నే చట్టవిరుద్ధం చేయబోతున్నారు. పైగా పెలాడియం మరియు ట్రెచరస్ కంప్యూటింగ్ (క్రితం నెల వ్యాసంలో దీనిపై చర్చ జరిగింది.) అనే ప్రయత్నంతో వేరే సాఫ్ట్‌వేర్లు మీ సమాచారాన్ని చదవటం అసంభవం చేయగలరు.

వర్డ్ డాక్యుమెంట్లు వాడటం మైక్రోసాఫ్ట్ వారి ఆధిపత్యానికి దోహదపడటమే అవుతుంది. మైక్రోసాఫ్ట్ వారు అక్రమంగా, చట్ట విరుద్ధంగా వారి వ్యాపార ప్రత్యర్థులను అణిచివేస్తుంటారు. ఈ విధంగా చాలా కంపెనీలను అణచివేసారు. దీనివల్ల టెక్నాలజీ అభివృద్ధికి ఎంతో నష్టం జరిగింది. అమెరికాలోనూ, ఐరోపాలోనూ కోర్టు మైక్రోసాఫ్ట్ వారికి ఎన్నో వేల కోట్ల జరిమానా విధించారు. అయినా మైక్రోసాఫ్ట్ వారు ఇలా చేయటం మానలేదు. వారికి తప్పుడు పనులు చేస్తే కోర్టు వారు వేసే జరిమానా కంటే వారికి వాటిపై వచ్చే లాభమే ఎక్కువ.

ఇతర మార్గాలు

మీరు రాసిన వ్యాసాలు వర్డ్ డాక్యుమెంట్లులా కాకుండా వేరే డాక్యుమెంట్లలా పంపించటానికి చాలా మార్గాలున్నాయి. మాలుగాటెక్స్ట్ (వట్టి అక్షరాలు) పద్ధతిలో కనుక మీరు వ్యాసాన్ని పంపితే, అది వర్డ్ డాక్యుమెంట్ కంటే పదింతలు చిన్నదిగా ఉంటుంది. ఇటువంటి పద్ధతిలో దాచిన వ్యాసాలను ఎక్కడి నుండైనా ఎటువంటి పద్ధతిలో దాచిన వ్యాసాలని ఎక్కడి నుంచైనా ఎటువంటి కంప్యూటర్ నుండైనా, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ లేకుండానే చూడవచ్చు. సెల్‌ఫోనులో ఇ-మెయిల్ వాడేవారికి, ఇంటర్నెట్ కనెక్షన్ సరిగాలేనివారికి ఇది సదుపాయంగా ఉంటుంది. సాధ్యమైనంతగా టెక్స్ట్ పద్ధతిలో మీ వ్యాసాలను పంపించండి. అలా కుదరనప్పుడు మీరు ఎచ్.టీ.ఎం.ఎల్.లా కానీ పీ.డీ.ఎఫ్.లా కానీ ఓపెన్ డాక్యుమెంట్‌లా కాని పంపవచ్చు. మీరు మైక్రోసాఫ్ట్ వర్డ్‌లో రాసిన వ్యాసాన్ని టెక్స్ట్ లేదా ఎచ్.టీ.ఎం.ఎల్.గా మార్చటానికి **"File"** మెనూలో **"Save as"** ను వాడవచ్చు. మీ కంప్యూటర్‌పై పీ.డీ.ఎఫ్. సాఫ్ట్‌వేర్ కనుక వుంటే **"File"** మెనూలో **"Print"** వాడి, అక్కడ పీ.డీ.ఎఫ్. ఫైల్‌ను ఎంచుకోవచ్చు. ఉచితంగా లభించే ఓపెన్ ఆఫీస్.ఆర్గ్‌లో కనుక మీరు వర్డ్ డాక్యుమెంటును చూడగలిగితే అక్కడ దానికి ఓపెన్ డాక్యుమెంటులా మార్చవచ్చు.

వర్డ్ డాక్యుమెంట్లను ఆపండి

వర్డ్ డాక్యుమెంట్లు ఎందుకు వాడకూడదని చూశాము. ఇతరులు కూడా మనకి వర్డ్ డాక్యుమెంట్లు పంపకుండా వుండేలా చేయవచ్చు. మీకు ఎవరైనా వర్డ్ డాక్యుమెంట్లు పంపించినప్పుడు మీరు వారికి మర్యాదపూర్వకంగా ఆ డాక్యుమెంటును తిరిగి వంపించండి. మీరు ఆ డాక్యుమెంటును చదవలేరని, ఆ డాక్యుమెంటులోని వ్యాసాన్ని మీరు మైక్రోసాఫ్ట్ వర్డ్ లేకుండా చదవగలిగే పద్ధతిలో పంపించమని అడగండి. మీరు కనుక ఫ్రీసాఫ్ట్‌వేర్‌లో చదవగలను కదా అని ఏ డాక్యుమెంటు అయినా ఒప్పుకుంటే అది సమస్యని తీవ్రం చేస్తుంది. ఒక రోగాన్ని నయం చేయకుండా దానివల్ల వచ్చే సూచనలను నయం చేసినట్లవుతుంది. ఒకరు చెప్తే విని పట్టించుకోనివారు మరికొంతమంది చెప్తే తప్పక పట్టించుకుంటారు.

మరింత సమాచారం కోసం ఈ వెబ్ పేజీని చూడండి. **http://www.gnu.org/philosophy/no-word-attachments.html.**

- సునీల్ మోహన్

టెక్కు ఎక్కువైంది.. తగ్గెహె!

యాద్గిరి చిన్నాన్న వరసవుతడు. ఒకే ఏడాదిలో పుట్టినోళ్లం కాబట్టి నేను కాకా అని ఎన్నడు పిల్వలే. నేను ఆయనకన్నా రెండునెలలు పెద్దోణ్ని కాబట్టి యాద్గిరీ.. అని దోస్తును పిలిచినట్లు పిలిచేదోణ్ని. ఇంటర్ దాంక ఇద్దరం కల్సి తిర్గినం.. కలిసే సదువుకున్నం. తర్వాత నేను మా సోపతిగాళ్లతోని ఖాళీగనే కూసున్న. ఉత్త చేతుల్తో కూసుంటే ఊర్లో బర్లకూ మాకూ తేడా లేదనుకున్న మా అయ్య నన్ను తీస్కపోయి పొలంలో పడేశిండు. ఎవుసం చేసుకుంట నేను కూసుంటే.. యాద్గిరి కంపూటరు సదువులు సదవబట్టిండు. అంతటితో ఆగితే మంచిగనే ఉంటుండె. కానీ ఆడి కాళ్లు భూమికి ఆనట్లేదు.. కళ్లు నెత్తిమీదకు పోయినయ్. నన్ను జూడంగనే టెక్కు మీద టెక్కు. 'సూశినవా.. నువ్వు ఎద్దు ముడ్డి తోముతుంటే.. నేను ఎట్ల మిషన్ నడుపుతున్ననో' అన్నట్లు చూసెటోడు. కటికోని దగ్గర మేకను జూశినట్టు నన్ను జాలిగా చూస్తుంటే, నాకు మా అయ్యమీద



మస్తు కోపమొచ్చేది. రోజులు గడిసిపోయినయ్. మాకు పెళ్లిళ్లయినయ్. నా భార్య బీడీలు చేస్తది. ఇక యాద్గిరి గాని అత్తగారోళ్లు లచ్చాధికారులు. పెండ్లి అయినంక రెండునెళ్లకే వాడు అమెరికా పోయిండు. ఆడ ఏదో పెద్ద కొలువే దొర్కిందంట. ఇగ ఈడ నా చేతుల పడ్డంక పొలం మంచిగైంది. అప్పులు తీరినయ్. పదేండ్ల తర్వాత నిన్న యాద్గిరి మళ్లా మా ఊళ్లె అడుగుబెట్టిండు. ఆనికోసం ఊర్లె ఉన్న పోరగాళ్లతోని కల్సి సన్మానం ఏర్పాటు చేశినం.

అన్ని ఏండ్ల తర్వాత కూడా యాద్గిరి గాని గుణం ఏం మారలే. 'మాటలు మాణిక్యాలు.. చేతలు యాలకులు' అన్నట్లు గొప్పలు చెప్తడు. ఎదుటోడు నమ్ముతడా.. లేదా అనికూడా చూసుకోడు. వచ్చీరాంగనే 'ఏంరా యాద్గిరి పదిరోజుల కిందటనే ఒస్తనన్నవ్.. లేటైంది' అని అడిగిన. 'ఇగో మా ఆఫీసుల కంపూటర్లకు వైరసు అచ్చింది. ఆడ పన్జేశేటోళ్లందరూ మంచంల పడ్డరు..అందుకే లేటైంది' అన్నడు. 'కంపూటర్లకేదో మాయరోగమొస్తే పన్జేశేటోళ్లు జబ్బునపడటమేంది?' అని నేనడిగిన. 'మీకు తెల్వదు.. కంపూటర్లకు వైరసొస్తే. అంతే.. ఎట్ల తక్వజేయాలని సోంచాయించి సోంచాయించి.. అందరూ కుప్పకూల్తరు' అన్నడు. 'మరి మా పొలంకు ఆకుముడత తెగులొస్తే.. మా ఆయన మంచిగనే ఉంటడే..' తలగోక్కుంట నా భార్య అడిగితే వినుక్కుంట వెళ్లిపోయిండు యాద్గిరి. సాయంత్రంపూట సన్మానం మొదలైంది. నిజం చెప్పుద్దుగానీ.. యాద్గిరి మైకు పట్టుకోంగనే నాకు వణకడం షురువైంది. మా చిన్నమ్మ పరిస్థితి కూడా గట్లనే ఉన్నది. 'నేను పన్జేశే కంపూటర్ల ఫ్యాక్టరీ మన ఊరుకన్నా పెద్దగుంటది. లక్షలమంది అక్కడుంటరు. ఆడ ఎవ్వనికీ పేర్లుండవు.. అన్నీ నంబర్లే.. నా నంబరే వేలల్లో ఉంది..' అని చెబుతుంటే మా పోరగాళ్లు నోళ్లుతెరిచి వింటున్నరు. 'మా కంపెనీ గేటు దగ్గర వాచ్‌మెన్లే వందల సంఖ్యల ఉంటరు.. అసలు మొత్తం ఆఫీసుచూస్తే మాకే కండ్లు తిర్గుతయ్.. మీరొక లెక్కనా.. బిల్డింగే 25 కిలోమీటర్ల పొడవు.. అడ్డంల 30 కిలోమీటర్లు..' యాద్గిరి చెప్పుకుంట పోతనే ఉన్నది. గంటకు 60 కిలోమీటర్ల స్పీడుతోని బుల్‌డోజర్ నడిపినట్లు నా వణుకుడు ఎక్కువై కుర్చీ ఎగిరెగిరిపడుతోంది. పక్కనే ఉన్న మా చిన్నమ్మ వరిస్థితి అర్థంజేసుకుంది.

టక్కున యాద్గిరిగాని కాలును గట్టిగా తొక్కింది. వాడు సౌండు రాకుండా బాధపడుతూ ఏందన్నట్లు చూశిండు. 'ఎక్కువైతంది.. తగ్గు.. తగ్గూ..'అని గుసగుసగా చెప్పింది. సరేనని మళ్లా మాట్లాడటం మొదలుపెట్టిండు.. 'మా ఆఫీసు ఎత్తు మీకు చెప్పలేదు కదూ.. పది సెంటీమీటర్లు..' అన్నడు. ఇగ వాని మాటలు ఎవనికీ వినపడలే. అందరూ కిందపడి పొర్లిపొర్లి నవ్వుతున్నరు. ఇగ పంచె ఎగగట్టి ఎనక్కి తిరిగి చూడకుండా నేను ఇంటిదిక్కు పరుగులు దీసిన.

- ఆర్.ప్రవీణ్‌కుమార్

సందేహాలు - సమాధానాలు

నా కంప్యూటర్‌లో ఆసూస్ మదర్‌బోర్డ్, విండోస్ 98 సెకండ్ ఎడిషన్ ఉంది. అందులో నెట్‌వర్క్ నైబర్‌హుడ్ ఓపెన్‌చేస్తే ఎమ్.పి.ఇ.ఎక్స్.ఇ అనే ఎర్రర్ వస్తుంది. నెట్‌వర్క్ రావడంలేదు. పరిష్కారం తెలుపగలరు.

- విద్య, కోదాడ

మీరు ఇంటర్నల్ కార్డా, ఎక్స్‌ట్రనల్ కార్డా తెలియజేయలేదు. ఇంటర్నల్ కార్డు అయితే దాని వెర్షన్ నెట్‌వర్క్ డ్రైవర్స్ సరిగా ఇన్‌స్టాల్ కాకపోతే మీరు చెప్పిన ఎర్రర్ వస్తుంది. మరొకసారి డ్రైవర్స్‌ని రీఇన్‌స్టాల్ చేసుకోగలరు. అదే ఎక్స్‌ట్రనల్ కార్డ్ అయితే ఒకసారి కార్డు తొలగించి మరల అమర్చి, దాని నెట్‌వర్క్ కార్డు డ్రైవర్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

×××

నాకొక డిటిపి సెంటర్‌లో మొత్తం అయిదు సిస్టమ్స్ వున్నాయి. అవన్నీ విండోస్98 ఆపరేటింగ్ సిస్టమ్‌తో వున్నాయి. ఇప్పుడు కొత్తగా మరో సిస్టమ్ కొన్నాను. దానికి విండోస్ xp ఆపరేటింగ్ సిస్టమ్ ఇన్‌స్టాల్ చేయించాను. అప్పటినుండి తరచుగా నెట్‌వర్క్ సమస్య వస్తోంది. దాంతోపాటు xpలో తెలుగు ఫాంట్స్‌కు ఏ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలో తెలుపగలరు.

- నర్సింహ, ధర్మన్నగూడెం

మీ సిస్టమ్స్‌లో నెట్‌వర్క్ సమస్య వస్తుందంటే అది వర్క్‌గ్రూప్ వల్ల అయివుండొచ్చు. అందుకని మీకు విండోస్ 98 నెట్‌వర్క్ గ్రూప్ నేమ్ ఏదైతే ఇచ్చారో ఆ గ్రూపు పేరునే ఒకటి కూడా ఇస్తే సరిపోతుంది. అదేవిధంగా ఎక్స్‌పీకి వెర్షన్‌కు అనువుగా తెలుగులో ఐదారు రకాల ఫాంట్స్ లభిస్తున్నాయి. వాటిలో మీకు అవసరమైన ఫాంట్స్ ప్యాకేజిని ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.

మలేరియా సమాచారం అందించే సాఫ్ట్‌వేర్

"ప్రపర్లలో నిత్యం చదివే వార్త ఒక్కసారిగా మలేరియా విజృంభించిందని" అనేకమంది దాని బారిన పడి చనిపోతున్నారని చదువుతుంటాం. గిరిజన తండాలలో అయితే మరీ ఎక్కువ మరణాలకు మలేరియా కారణం అవుతుంది. మలేరియా ఎప్పుడు ఎక్కువ అవుతుందనే సమాచారం ముందుగా లేకపోవడమే కొంతవరకూ ఈ మరణాలకు కారణం. ఇప్పుడు వాతావరణ సమాచారంతోపాటు ఈ మలేరియా ఉధృతిని గురించిన సమాచారం ఇచ్చే పద్ధతివల్ల మలేరియా మరణాలను తగ్గించవచ్చు.

వాతావరణ సమాచారం మనం రోజూ టీవీలో చూస్తూనే ఉంటాం. ఇప్పుడు కొత్తగా వచ్చిన టెక్నాలజీ వలన వాతావరణంతోపాటు ఎనొస్సర్లు మనకు ఇంటి దోమల దాడి ఉంటుందా? ఉండదా? అనే సమాచారం కూడా చెప్పబోతున్నారు. ఇప్పుడు కనీసం ఐదు నెలల ముందే మనకు మలేరియా గురించిన సమాచారం అందించే సాఫ్ట్‌వేర్ సిద్ధంగా ఉంది.

ఏటా మలేరియా వలన కనీసం 10లక్షల మంది చనిపోతున్నారు. కనీసం 5కోట్ల మంది దాని బారిన పడుతున్నారు. ఆఫ్రికాలో అయితే దాదాపు 90% మంది ప్రజలు ఎప్పుడో అప్పుడు మలేరియా జ్వరం వచ్చిన వాళ్ళు ఉన్నారు.

ప్రత్యక్షంగా వాతావరణంలో మార్పులు మలేరియా పరాన్న జీవుల పెరుగుదలకు తోడ్పడతాయి. ఇప్పుడు వచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ వలన వాతావరణ మార్పులు వాటి పెరుగుదలకు ఎలా దోహదం చేస్తున్నాయి, మార్పుల బట్టి దోమలు ఎలా ప్రవర్తిస్తాయి. ఎప్పుడు ఒక్కసారి పెరిగి ఇళ్ళ మీద పడుతాయి అనే విషయాలు తెలుసుకోవచ్చు.

ఇలా ముందు సమాచారం పొందటం వలన ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం కుదురుతుంది. రోడ్లమీద దోమల మందు చల్లడం, దోమతెరలు కట్టుకోవడం వంటి జాగ్రత్తలు మనం తీసుకునే అవకాశం ఉంటుంది.

యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియమ్ రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ ఇన్ రీడింగ్ యు.కె.లో పనిచేస్తున్న డా॥టిమ్ పాల్‌మర్ వాతావరణ సమాచారాన్ని ముందుగా తెలుసుకోవడం వల్ల దోమల పెరుగుదల తెలుస్తుంది, దానితో మలేరియా పెరుగుదలను అరికట్టే చర్యలు తీసుకోవచ్చు అని చెబుతున్నారు.

ఇదిపరకు వీళ్ల వాతావరణాన్ని ఆధారంగా చేసుకొని మలేరియా సమాచారాన్ని నెల ముందుగానే ఇచ్చేవారు. దీనిని స్వల్ప మార్పులతో ఇప్పుడు ఐదు నెలల ముందుగా సమాచారాన్ని ఇచ్చే సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు. ఇది ఎంత వర్షం పడుతుంది. సముద్ర ఉపరితలం ఉష్ణోగ్రతల ఆధారంగా పనిచేస్తుంది. అది మలేరియా కేసులు ఎక్కువ అయినాయన్న దానికి సూచన.

ఈ కొత్త మలేరియా సమాచారాన్ని అందించే టెక్నాలజీ "అసెంబిల్ ఫోర్‌కాస్టింగ్" అనే పద్ధతి ద్వారా పనిచేస్తుంది. ఇందులో వివిధ ప్రాంతాల వాతావరణాన్ని పొందుపరచి ఉంచుతారు. దీనిని ఆధారంగా చేసుకొని ఖచ్చితమైన సమాచారం ఇవ్వగలిగే అవకాశం ఉంది.

డా॥టి వ్ం గ్రూప్‌కు చెందిన సభ్యులు 1982 నుండి 2002 వరకూ బోట్సవానాలో మలేరియా ఒక్కసారిగా ఎప్పుడు విజృంభిస్తుంది అనే సమాచారాన్ని ఖచ్చితంగా ఇచ్చారు. అక్కడ ఈ ఫలితాలు విజయం సాధించిన తరువాత అన్ని ప్రాంతాలలోనూ ఈ ప్రయోగాలు చెయ్యడానికి సిద్ధపడుతున్నారు.

మలేరియా లాగే డెంగ్యూఫీవర్, కలరా వంటి అంటురోగాలు వాతావరణ మార్పులతోపాటు ఎలా వస్తున్నాయి అనేది కూడా వాతావరణ సమాచారంతోపాటు ఇవ్వాలనేది వీరి ఆలోచన.

- పావని